# విపశ్యన మాసపత్రిక

VOLUME:33 NO - 24 1 MARCH, 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70


**"ధర్మవాణి"**

*అత్తనా హి కతం పాపం, అత్తనా సంకిలిస్సతి !*
*అత్తనా అకతం పాపం, అత్తనావ విసుజ్ఝతి!*
*సుద్ధీ అసుద్ధి పచ్చత్తం, నాఅఞ్ఞో అఞ్ఞం విసోధయే !!*
*- ధమ్మపద - 165, అత్తవగ్గో*

మనం చేసుకున్న పాపాలే మనల్ని కలుషితం చేస్తాయి. స్వయంగా పాపాలేవీ చేయకపోతే మానవుడు తనంతటతాను విశుద్ధుడిగానే నిలిచి ఉంటాడు. ప్రతి మానవునికీ వారి వారి శుద్ధి, అశుద్ధులు (వారి వారి మంచి కర్మల, చెడు కర్మల పరిణామ స్వరూపాలు) ఉండనే ఉంటాయి. ఒక వ్యక్తి మరో వ్యక్తిని ఎలా శుద్ధి చేయగలడు? (ఎలా ముక్తుడిని చేయగలుగుతాడు?).

## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(మూలం: ఏప్రిల్ 19, 2019 న వెలువడిన హిందీ మాసపత్రిక )**

*విపశ్యనా సాధన పునఃస్థాపితమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఒక సంవత్సరం పాటు - అనగా 3 జూలై 2018 నుండి 2 జూలై 2019 వరకూ గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు క్రమబద్ధంగా నిర్వహించబడ్డాయి. ఈ శిబిరాలు సాధకుల రోజువారీ సాధనను పుష్టి చేయడానికి సహాయ పడగలవని నిర్వహించారు. సాధకులకు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందారు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వచ్చి, ఆ తరువాత అలాంటి వారి నుండి ప్రేరణ పొంది, ఇతరులలో సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగానే, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్యలోని వ్యవహారిక పక్షాన్ని అంటే సాధన యొక్క ఆచరణను దృఢపరుచుకోడానికే ఈ శిబిరాలు జరుపుకోబడ్డాయి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత అవుతుంది.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధ ధర్మసంపర్కంలోకి రాకముందు జరిగిన సంఘటనలు మరియు బాల్యం నుండి యవ్వన దశ వరకూ వారిలోని భక్తి భావాన్ని గురించి ఎలాంటి భ్రమా కలగకూడదని, ఇంకా ఇలాంటి వ్యక్తి కూడా ఏ విధంగా మారగలడోనని తెలుసుకొని వారి నుండి ప్రేరణ పొందాలనే ఉద్దేశ్యంతో, వారి ఈ సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే - **ఎనిమిద భాగం.***

### పునరావలోకనం

శిబిరం పూర్తయిన తరువాత ఇంటికి వెళ్లి పదిరోజుల అనుభవాలను పునరావలోకనం చేసుకున్నాను. అంతులేని సంసారిక ఉరుకులు-పరుగులకు దూరంగా ప్రాచీన కాలంలో ఋషి-మునుల పావన తపోభూమి వంటి పవిత్ర ధర్మ వాతావరణంలో గడుపుతూ అత్యంత సంయమనము, సాత్వికము, నిరాడంబరమైన జీవితాన్ని జీవిస్తూ ఈ పదిరోజుల్లో నేనేమి నేర్చుకున్నాను? ఏమి సాధించాను?

పదిరోజుల పాటు ఏదైనా కొండప్రాంతాల్లో సెలవులను గడిపి తిరిగి వస్తే జీవితంలో కొంత సమయం పాటు తాజాదనం వస్తుంది. మరి ఇక్కడి నుండి అయితే కాయకల్పం మరియు చిత్తకల్పాల అద్భుతమైన అసమానమైన తాజాదనాన్ని తీసుకొని ఇంటికి వచ్చాను. ఇంతటి ఆంతరిక సుఖాన్ని, ఆంతరిక శాంతిని నేను నా జీవితంలో ఎన్నడూ అనుభూతి చెందలేదు. గురువు గారి ఆదేశానుసారంగా ఇంటికి తిరిగి వచ్చి ప్రతిరోజూ ఉదయం-సాయంత్రం ఒక్కొక్క గంట చొప్పున విపశ్యన సాధన చేస్తూ ఉండటంతో కేవలం సాధన చేస్తున్నంత సేపే కాకుండా ఆ తరువాత కూడా ఈ ప్రశాంత అనుభూతి ఎంతో సమయం పాటు నిలిచే ఉంటుందని గమనించాను. ఇప్పుడు నాకు ప్రాణాంతకమైన మైగ్రెన్ నొప్పి నుండి శాశ్వత విడుదల దొరకటం కాకుండా బాధకరమైన మార్ఫిన్ దుష్ప్రభావం నుండి కూడా బయటపడ్డాను. అయితే వీటన్నింటినీ మించి వికారాల కారణంగా మనసులో నెలకొని ఉన్న వ్యాకులత ఇప్పుడు మెల్లమెల్లగా తగ్గుతూపోయింది. వికారాలు రోజు రోజుకూ నశిస్తూ పోసాగాయి. ఈ ఉద్దేశ్యంతోనే నేను శిబిరంలో పాల్గొన్నాను. ఇప్పుడు మనస్సులో వికారాలు తలెత్తితే ఈ విద్య ద్వారా వాటిని ఎదుర్కోవటం వచ్చేసింది.

ఇప్పుడు రాగం తలెత్తినా, ద్వేషం తలెత్తినా, భయం తలెత్తినా, అహంకారం తలెత్తినా, కామవాంఛ తలెత్తినా, క్రోధం తలెత్తినా; ఏ వికారం తలెత్తినా దానితో పాటుగా ప్రజ్ఞ మేల్కొని ఆ సమయంలో శరీరం మీద కలుగుతుండే సంవేదనలను గమనిస్తూ, గమనిస్తూ ఆ వికారం బలహీనపడుతూపోయింది; ఆ వికారం కారణంగా కలిగిన వ్యాకులత దానంతటదే క్షీణిస్తూపోయింది. కామ క్రోధ అహంకారాల వంటి లోతైన దూషిత వికారాల నుండి విడుదల పొందటానికి నా సగుణ-సాకార ద్రవీభూత భక్తి మరియు గీత, ఉపనిషత్తుల వేదాంత చింతన మననలు

శాశ్వత ప్రయోజనం ఇవ్వలేదు. కానీ కేవలం పదిరోజుల సాధనతో ఈ వికారాలు బలహీనపడుతూ దూరమవటం మొదలయింది. వికారాలను వేళ్లతో సహా తొలగించుకొని అంతర్మనసులో పాతుకుపోయిన దూషిత స్వభావపు సంకెళ్లను వైజ్ఞానిక పద్ధతిలో ఏ విధంగా అంతం చేసుకోవచ్చు అనే ఈ సాధనా పద్ధతి యొక్క ప్రత్యేకత స్పష్టంగా అర్థమయింది. వెంటనే ఫలాలనిచ్చే విద్యను పొందిన మనస్సు ఎంతో సంతోషంతో తృప్తి-ప్రసన్నత చెందింది; చికిత్సలేని నా జబ్బుకు సంజీవనీ ఔషధం దొరికినట్లయింది.

ఈ ఔషధం ప్రాప్తించటానికంటే ముందు కామ క్రోధ అహంకారాల ప్రబల వికారాలతో నిండిన నా మనసు కలత చెందినప్పుడు ఉదయాన్నే కన్నీటిపర్యంతం అవుతూ గద్గద కంఠంతో ఏడుస్తూ ఈ విధంగా భజన చేసేవాడిని–

" ప్రభుజీ మేరే అవగుణ్ చిత్త్ న ధరో ।

సమరసీ ప్రభు నామ్ తిహారో, ముఝ్ పర్ కృపా కరో॥"
ఇత్యాది, ఇత్యాది అని, లేదా,

"ప్రభుజీ మై తో థారో జీ థారో ।

కపటీ క్రోధీ కుటిల్ అర్ కామీ, జోభీ హూ సో థారో ।

ఆంగలియా నూ పరే న హెూవై, ఆ తో ఆప్ విచారో ॥"
– ఇత్యాది, ఇత్యాది.

ఇప్పుడు ఈ మంగళకరమైన విద్య దొరకటంతో ప్రతిరోజూ ఉదయాన్నే చేసే ఏడుపు – ఆక్రందనల నుండి ముక్తి లభించింది. ఒకటే శిబిరంతోనే, నా మనసును నేనే మలినపరుచుకుంటాను, దానిని బాగుచేసుకునే బాధ్యత కూడా నాదే అనే సత్యం అర్థమయింది. మనసును బాగుపరుచుకునే విద్య తెలియనంత వరకూ అదే భ్రమలో జీవిస్తుండేవాడిని. ఇప్పుడు దాని నుండి విడుదల దొరికింది. ఇప్పుడు ఎప్పుడైనా ఉదయాన్నే భజనలు పాడితే కూడా, అవి ఈ విధంగా ఉండేవి –

"ఉఠ్ జగ్ ముసాఫిర్ భోర్ భయి, అబ్ రైన్ కహా జో సోవత్ హై?...." ఇత్యాది, ఇత్యాది. లేదా,

"తేరీ గఠరీ మే లాగా చోర్, ముసాఫిర్ జాగ్ జరా ।.... "
ఇత్యాది, ఇత్యాది, లేదా,

"వైష్ణవ్ జనతో తేనే కహియే, జో పీర్ పరాఈ జానే రే ॥"
ఇత్యాది, ఇత్యాది అని.

ఇప్పుడు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఏడుస్తూ ఆక్రందనలు పెట్టే అధ్యాయమైతే సమాప్తమైపోయింది, కొద్ది సమయం తరువాత ఈ సాధారణ భజనలు కూడా తప్పిపోయాయి. ఆ సమయాన్నంతా సాధనకే ఎందుకు కేటాయించకూడదు? అని ఆలోచించాను.

## ఏమి అభ్యాసం చేశాను?

ఈ విద్యను నేర్చుకోవటానికి అక్కడ ఏమి అభ్యాసం చేశాను? – అత్యంత నిర్మలమైన ధర్మాన్నే సాధన చేశాను. పంచశీలాలను పాటించాను. చిత్తాన్ని ఏకాగ్రపరచటానికి సమాధిని అభ్యాసం చేశాను. ఆ తరువాత నాలోని ప్రజ్ఞను వీలయినంతగా మేల్కొలుపుకుని చిత్త విశుద్ధి కొరకు ప్రయత్నం, కృషి చేస్తూపోయాను. ఈ మూడింటి సాధనలో ఎక్కడా ఎటువంటి దోషమూ కనిపించలేదు.

శరీరంతో, వాక్కుతో చేసే దుష్కర్మల నుండి బయటపడి, శీలసదాచారాలను పాటించటాన్ని వైదిక ధర్మమే కాకుండా ప్రపంచంలోని అన్ని ధర్మాలూ అంగీకరిస్తాయి. అన్నీ దానిని మంచివని నమ్ముతాయి. వేలకొద్దీ ప్రవచనాలు వింటూ ఉన్నప్పటికీ మనసును వశపరుచుకోకుండా శీలపాలన సాధ్యపడదు. ఈ విషయం అందరికీ తెలిసిందే. అక్కడ మనసును వశపరుచుకునే సాధన నేర్పించబడింది. అందుకొరకు ఇవ్వబడిన స్వభావసిద్ధమైన శ్వాస అనే దోషరహితమైన, సార్వజనీనమైన ఆలంబనను అందరూ ఉపయోగించగలరు.

మనసును వశపరుచుకోవటం మంచిదే. కానీ శీలసదాచారాలను జీవితంలో ఒక భాగంగా చేసుకోవటానికి చిత్తాన్ని వేర్ల వరకూ నిర్మలం చేసుకోవటం అవసరం. లేకపోతే అంతర్మనసులో ప్రోగు చేసుకున్న వికారాలు బద్దలయినప్పుడు చిత్తం మళ్ళీ విచలితమై, శీలపాలన కష్టమైపోతుంది. కాబట్టే శారీరిక సంవేదనల ఆధారంగా ప్రజ్ఞ ద్వారా చిత్తాన్ని అత్యంత నిర్మలంగా చేసుకునే సాధన నేర్పించబడింది. అది కూడా అందరూ ఒప్పుకునేదే, అందరికీ వర్తించేదే. ఇది అందరూ సాధన చేయగలిగేదే.

"బుద్ధుడు అవటమనేది కేవలం సిద్ధార్థ గౌతముని ఏకాధికారం కాదు. వారికంటే ముందు కూడా ఎంతోమంది బుద్ధులయ్యారు. వారి తరువాత కూడా అవుతారు. బుద్ధుడయిన ఏ వ్యక్తి అయినా లేదా కాబోయే ఏ వ్యక్తి అయినా, వారు బోధించే సార్వజనీనమైన బోధన ఇదే" అని మా గురువుగారు చెప్పారు. అదేమిటంటే –

1. దుష్కర్మలు చేయకపోవటం – అంటే శీల సదాచారాల జీవితాన్ని జీవించటం.

2. సత్కర్మలు చేయటంలో నిమగ్నమవటం – అంటే కుశల చిత్త ఏకాగ్రతను పొందటం. కుశల చిత్తాన్ని ఏకాగ్రపరుచుకుని ఏ కర్మలు చేస్తామో, అవన్నీ స్వతహాగా సత్కర్మలే అవుతాయి.

3. కేవలం పై పై పొరల వరకే కాకుండా, వేర్ల వరకూ సంపూర్ణంగా చిత్తాన్ని నిర్మలపరచటం.

ఈ సారాన్నే ముందు బుద్ధవాణిలో కూడా చదివే అవకాశం దొరికింది. స్వయంగా బుద్ధుడే ఈ విధంగా చెప్పారు –

*"సబ్బ పాపస్స అకరణం, కుసలస్స ఉపసంపదా ।*

*సచిత్తపరియోదపనం, ఏతం బుద్ధాన సాసనం ॥"*

– ధమ్మపద, 183.

అన్ని పాపకర్మల నుండి విరతులు కావటం, కుశల కర్మల సంపదను ప్రోగుచేసుకోవడం మరియు చిత్తాన్ని పరిపూర్ణంగా శుద్ధి చేసుకోవటం ఇదే బుద్ధులందరి బోధన.

ఇదే శీలము, సమాధి మరియు ప్రజ్ఞ. బుద్ధుడయిన ప్రతి ఒక్కరూ

ఈ మూడింటినే బోధిస్తారు. కేవలం బోధించటమే కాకుండా బుద్ధులు వాటిని ప్రయోగాత్మకంగా సాధన చేయటాన్ని నేర్పిస్తారు. అందుకే బుద్ధుని బోధనలు వెంటనే ఫలితాలనిస్తాయి. మొదటి శిబిరంలోనే ఈ సత్యం చక్కగా అర్థమై, బుద్ధుని బోధనల ఈ వ్యావహారిక పక్షం నిజంగానే అపురూపమైనది, అద్భుతమైనది, అమూల్యమైనదని అనిపించింది.

ఈ విద్య పూర్తిగా బాగుందని అనిపించింది. కానీ మనస్సులో మళ్లీ ఒక ప్రశ్న ఉదయించింది. అదేమిటంటే ఒకవేళ బుద్ధుడు కేవలం శీల, సమాధి, ప్రజ్ఞల వ్యావహారిక ధర్మాన్నే నేర్పిస్తే మన దగ్గర వారి బోధనలను ఎందుకు ఇంతగా వ్యతిరేకించారని అనిపించింది. బహుశా ఈ శిబిరంలో నాకు అర్థంకాని మరేవైనా దోషాలు మన పెద్దలకు అర్థమై ఉండవచ్చు. వాటి కారణంగా వారు వీటిని వ్యతిరేకించి బుద్ధుని బోధనలను భారతదేశం నుండి పూర్తిగా బహిష్కరించి ఉండవచ్చు. దానిని కనుక్కోవడానికి నేను బుద్ధవాణిని చదివి అందులో ఏవైనా లోపాలు కనిపిస్తే వాటిని త్యజించి, మంచి విషయాలను మాత్రమే స్వీకరించాలి అని నిర్ణయించుకున్నాను. శీలము, సమాధి, ప్రజ్ఞల్లోనైతే అంతా మంచే ఉన్నది. దానిని నేను స్వయంగా అభ్యాసం చేసి చూశాను. దాని ఫలితం ఎంతో కళ్యాణకరమైనది. ఇక ఇప్పుడు బుద్ధుని బోధనల సైద్ధాంతిక పక్షాన్ని కూడా చదివి అర్థం చేసుకోవాలి అని అనుకున్నాను.

## బుద్ధవాణి అధ్యయనం

నేను అన్నిటికంటే మొదటగా శ్రద్ధవంతుడైన ఆనంద్‌గారు నా వద్ద వదిలి వెళ్లినప్పటి నుండి నా టేబుల్ మీదనే పడి ఉన్న ధమ్మపద పుస్తకాన్ని చదివాను. ధమ్మపదలో ఒక్కొక్క పద్యాన్ని (పదను) ఎంతో ఏకాగ్రతతో చదువుతూపోయాను. ఎక్కడైనా ఏదైనా దోషం కనపడితే దానికింద ఏదైనా చిహ్నాన్ని పెడదామనే విమర్శనాత్మక దృష్టికోణంతో చదువుతూపోయాను. కానీ పుస్తకంలోని ఏ పద్యంలోనూ రవ్వంత దోషం కూడా లేదు అని తెలుసుకోవటంతో ఎంతో సుఖకరమైన ఆశ్చర్యం కలిగింది. బహుశా చదవటంలో ఏదైనా లోపం ఉండవచ్చు అని ఆలోచించి మరో రెండుసార్లు ఎంతో ధ్యాసతో చదివాను. మళ్ళీ అదే సుఖకర పరిణామం వచ్చింది. ధమ్మపదను బుద్ధుని బోధనల సారంగా భావించినప్పటికీ బుద్ధవాణిలోని ఇతర గ్రంథాలను కూడా చదివి చూడాలని అనిపించింది. బహుశా వాటిలో ధర్మ విరుద్ధమైన బోధనలేవైనా ఉన్న కారణంగా మన పూర్వీకులు వాటిని వ్యతిరేకించాల్సి వచ్చిందేమో అనే ఆలోచన కలిగింది. అలా ఒక్కొక్కటిగా బుద్ధవాణికి చెందిన అనేక గ్రంథాలను వాటి అనువాదాల సహాయంతో అర్థం చేసుకుంటూ చదువుతూపోయాను. ఒకవైపు ఉదయం-సాయంత్రం ఒక్కొక్క గంట చొప్పున క్రమం తప్పకుండా విపశ్యన సాధన, మరోవైపు ఎంతో పనివత్తిడితో కూడిన గృహస్థ జీవితం నుండి తగిన సమయాన్ని కేటాయించి బుద్ధవాణి అధ్యయనం చేయటం ఈ రెండింటిని కొనసాగించటంతో ఎంతో ప్రయోజనం చేకూరింది. అంతే కాకుండా నేను రంగూన్‌లో ఉన్నప్పుడల్లా ప్రతి ఆదివారం గురుదేవుల ధ్యానకేంద్రానికి వెళ్లి ఒక గంట సేపు సామూహిక సాధన చేస్తుండేవాడిని. అలాగే సంవత్సరంలో కనీసం ఒక్క పదిరోజుల శిబిరంలో, అప్పుడప్పుడూ ఏదైనా ఒక దీర్ఘ శిబిరంలో పాల్గొంటూ ఈ వ్యావహారిక భాగాన్ని అనుభూతుల ద్వారా కలిగిన ప్రజ్ఞతో మరింత లోతుల వరకు అర్థం చేసుకుంటూ ప్రయోజనం పొందుతూపోయాను.

నా అదృష్టం మేల్కొని అప్పటి సైనిక ప్రభుత్వం నన్ను సమస్త వ్యాపార మరియు ఉద్యోగ బాధ్యతల నుండి అన్ని విధాలా విముక్తుడిని చేసేసింది. ఆ తరువాత ఐదు సంవత్సరాల వరకు మయన్మార్‌లో ఉంటూ నేను బుద్ధవాణిని క్షుణ్ణంగా అధ్యయనం చేయగలిగాను. అలా అంత ఎక్కువ కాలం పాటు నాకు అవకాశం దొరకటం మరియు పూజ్య గురుదేవుల సాన్నిత్యం దొరకటం ఎంతో మహత్తరమైన విషయం. ఎప్పుడైనా ఏదైనా సూత్రాన్ని అర్థం చేసుకోవటంలో ఏదైనా ఇబ్బంది కలిగితే పూజ్య గురుదేవుల ద్వారా దానంతటదే సమాధానం ప్రాప్తించేది. అప్పుడప్పుడు వారు, బుద్ధవాణిలోని ఫలానా గ్రంథంలోని ఫలానా సూత్రాన్ని చదువుకుని రమ్మని నన్ను ఆదేశించేవారు. ఆ తరువాత, దాని నుండి నీవు గమనించిన లోతైన విషయం ఏమిటి అని అడిగేవారు. నేను అర్థం చేసుకున్న విషయాన్ని వారికి వివరించేవాడిని. నా వివరణతో వారు చాలామట్టుకు ప్రసన్నత చెందేవారు. కానీ అప్పుడప్పుడు నవ్వేసి, నీవు సరిగా అర్థం చేసుకోలేదని చెప్పేవారు. ఆ తరువాత ఎంతో ప్రేమతో వివరించి చెప్పి ఇప్పుడు శూన్యాగారంలో కూర్చుని ఒక గంటసేపు ధ్యానం చేసుకో అని చెప్పేవారు. ఆ గంటసేపటి ధ్యానం ఎంతో మేలు చేకూర్చేది. ఆ సమయంలో ఎన్నోసార్లు బుద్ధభగవానుడే స్వయంగా నాకు ఆ సూత్రాన్ని వివరిస్తున్నట్లుగా, అది నా అనుభూతిలోకి వస్తున్నట్లుగా అనిపించేది. మయన్మార్‌లోని ఇలాంటి అనుకూల వాతావరణంలో ఉంటూ బుద్ధవాణి అధ్యయనం చేయటం ఎంతో కళ్యాణకరమైనదిగా రుజువైంది.

ఒకవైపు విపశ్యన యొక్క గంభీర వ్యావహారిక అనుభవం, మరోవైపు బుద్ధవాణి యొక్క సైద్ధాంతపరమైన అధ్యాయనం ఈ రెండు ఏకకాలంలో నడుస్తూ ఉండేవి. వీటితో బుద్ధుని బోధనలు మరింత స్పష్టంగా అర్థమవుతూపోయాయి. ఎక్కడా రవ్వంత దోషమైనా కనబడటం కాదు కదా ప్రతిపదంలోనూ అమృత రసాస్వాద అనుభూతి కలిగేది. విపశ్యన సాధన లభించక ముందు, బుద్ధుని బోధనల పట్ల మనసులో ఉన్న భ్రమలను గుర్తుకు తెచ్చుకొని ఎంతో సిగ్గుపడ్డాను. మన దేశపు విద్వాంసులు బుద్ధుని బోధనల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల ముఖ్య కారణం ఏమిటంటే మూల- బుద్ధవాణిని చదవటానికి కానీ, దాని ప్రయోగాత్మక భాగమైన విపశ్యన సాధన చేసే అవకాశం కానీ వారికి దొరకలేదని అనిపించేది. ఎందుకంటే ఈ రెండూ కూడా బుద్ధుని తర్వాత దాదాపు అయిదు ఆరు వందల సంవత్సరాలు గడిచేసరికి, దేశం నుండి అన్ని రకాలుగా విలుప్తమైపోయాయి. ఈ నిందాత్మక వ్యాఖ్యలు - వ్యాఖ్యానాలు అన్నీ కూడా వెయ్యి సంవత్సరాల తరువాత వచ్చినవే. ఆ యుగంలో అప్పటి బౌద్ధులు మరియు పౌరాణికుల మధ్యన కఠిన వాగ్వాదాలు నడుస్తూ ఒకరిపైన ఒకరు ఎంతో బురద చల్లుకొని ఉంటారు అని స్పష్టంగా తెలుస్తుంది. కాలాంతరములో బౌద్ధుల పక్షాన నిలిచేవాళ్ళు మిగలకుండాపోవటంతో బుద్ధుల బోధనలపై చల్లబడిన బురద కళంకం రూపంలో అలానే అంటిపెట్టుకుపోయింది. ఆ ఐతిహాసిక సత్యాన్ని శోధించటానికి నేను పౌరాణిక పరంపరలకు సంబంధిచిన ఆ కాలపు సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేయాలి అని నిర్ణయించుకున్నాను.

అలా మయన్మార్‌లో ఉన్న సమయంలో భగవద్గీతను, కొన్ని ఉపనిషత్తులను, రామాయణ మహాభారతాలను ఎంతగానో అధ్యయనం చేశాను. కానీ భారతదేశానికి వచ్చిన తరువాత ఇతర సాహిత్యాలను కూడా చూశాను. ఈ పరిశోధనలో సాధకులైన నా శిష్యులు నాకు ఎంతగానో సహకరించారు. దాంతో దాదాపుగా తెలియవచ్చిన అసలు సత్యమేమిటంటే, మన పూర్వీకులు పరస్పర పోట్లాటలతో మనదేశానికి చెందిన ఒక అద్వితీయ మహాపురుషుని మంగళకరమైన బోధనలను కళంకితం చేయటమే కాకుండా దానిని దేశం నుంచి బహిష్కరించారు కూడా. దానితో దేశానికి అంతులేని కీడు జరిగింది.

ఇక ఇప్పుడు దేశమంతటా బుద్ధుని వ్యావహారిక బోధనైన "విపశ్యన"ను నిండు మనస్సుతో తమదిగా చేసుకున్నారు కాబట్టి, బుద్ధుని మూలవాణి ఆధారంగా వారి వాస్తవిక, సైద్ధాంతిక బోధన కూడా ప్రస్ఫుటమైతే, ఈ మిథ్యలన్నీ దూరమౌతాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన సంప్రదాయపరమైన ద్వేషాలు కూడా తొలగిపోతాయి. నేటి భారతదేశంలో హిందువులకు, బౌద్ధులకు మధ్యన ఉన్న లోతైన మనస్పర్ధలు తొలగిపోతాయి అని నాకు పూర్తిగా నమ్మకం ఉంది. అంతేకాకుండా భారతదేశంలో బుద్ధుని బోధనల పట్ల గతంలో వేయబడిన మిథ్యా కళంకాలను అసత్యమైనవిగా భావించి, వాటిని మళ్ళీ పునరావృతం చేయరు అని పొరుగున ఉన్న బౌద్ధ దేశాల ప్రజలు తెలుసుకుని వారెంతో సంతోషిస్తారు. ఇప్పుడు శుద్ధరూపంలో ఉన్న బుద్ధుని బోధనలను వారు అంగీకరిస్తారు. దానితో ఆ దేశాలతో మనకున్న స్నేహ సంబంధాలు ఇప్పుడు ఉన్నట్లుగా కేవలం పై పైస్థాయిలోనే కాకుండా, వారిలో మన పట్ల మనసు లోతుల వరకూ మైత్రితో కూడిన సద్భావనలు ఉదయిస్తాయి. దానితో కేవలం భారతదేశానికి మరియు దాని పొరుగు దేశాలకే కాకుండా, విశ్వమంతటికీ మేలు జరుగుతుంది అని నాకు అనిపిస్తుంది. విశ్వమంతటా విపశ్యనా విద్యను స్వీకరిస్తున్నారు. అయితే అక్కడ కూడా కొన్ని కొన్ని భ్రమలు ఉన్నాయి. భారతదేశంలో బుద్ధుని బోధనల విషయంలో మధ్యకాలంలో వ్యాపించిన అపవాదులు నిరాధారమైనవి అని విశ్వమంతటికీ తెలిసిన రోజు, వారి మనసుల్లో బుద్ధుని బోధనల పట్ల ఉన్న సంశయాలన్నీ దూరమైపోతాయి. అప్పుడు విశ్వంలోని ప్రజలందరూ మనసును ఆరోగ్యంగా ఉంచే ఈ సార్వజనీనమైన, సర్వహితకారిణి అయిన విపశ్యనా విద్యను, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచే ప్రాణాయామం మరియు ఆసనాల విద్యను స్వీకరించినట్లుగానే స్వీకరిస్తారు. నిస్సందేహంగా అది విశ్వమంతటికీ మంగళకరమైనదే.

– తరువాయి భాగం వచ్చే సంచికలో.

– ఆత్మకథన్ 2 నుండి సంగ్రహించబడినది

**ఈ వేసవి సెలవులలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించబడుతున్న ధ్యానకేంద్రేతర శిబిరాల వివరాలు –**

వనపర్తిలో – 25 ఏప్రిల్ నుండి 6 మే వరకు
కరీంనగర్‌లో – 27 ఏప్రిల్ నుండి 8 మే వరకు
తిరుపతిలో – 6 మే నుండి 17 మే వరకు
నంద్యాలలో – 7 మే నుండి 18 మే వరకు
కర్నూల్‌లో – 19 మే నుండి 30 మే వరకు
నిర్మల్‌లో – 6 మే నుండి 17 మే వరకు

ఈ శిబిరముల గురించిన మరింత సమాచారాన్ని www.dhamma.org వెబ్‌సైట్ నుండి పొందగలరు.

## కిశోర వయస్కుల శిబిరాలు

అబ్బాయిలకు – 09 ఏప్రిల్ నుండి 17 ఏప్రిల్ వరకు – నాగార్జునసాగర్‌లో
అమ్మాయిలకు – 27 ఏప్రిల్ నుండి 05 మే వరకు – హైదరాబాద్‌లో
అమ్మాయిలకు – 25 ఏప్రిల్ నుండి 03 మే వరకు – నాగార్జునసాగర్‌లో
అమ్మాయిలకు – 06 మే నుండి 14 మే వరకు – నాగార్జునసాగర్‌లో

## దీర్ఘ/ గంభీర శిబిరాలు

సతిపట్ఠానసుత్త శిబిరం – 25 మార్చి నుండి 02 ఏప్రిల్ వరకు – కొండాపూర్‌లో
సతిపట్ఠానసుత్త శిబిరం – 08 ఏప్రిల్ నుండి 16 ఏప్రిల్ వరకు – నాగార్జునసాగర్‌లో
20 – రోజుల శిబిరం – 24 ఏప్రిల్ నుండి 15 మే వరకు – నాగార్జునసాగర్‌లో
30 – రోజుల శిబిరం – 24 ఏప్రిల్ నుండి 25 మే వరకు – నాగార్జునసాగర్‌లో

**రెండు సంవత్సరాలకు చందా రూ 100/–** **విపశ్యన తెలుగు మానపత్రిక** **జీవిత చందా రూ. 500/–**
**ప్రచురణ తేది: ప్రతినెల 30/31** **పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2** **వెల: రూ 5/–**
**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**
**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం။ల నుండి సాయంత్రం 5 గం။ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.